క్లుప్తంగా

కోయగూడెం ఓసీ సింగరేణికే ఇవ్వాలి

టేకులపల్లి: కోయగూడెం ఓసీ 3 బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని, అరబిందో కంపెనీ టెండర్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, కుంజ రమేష్, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సావిత్రి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న భిక్షం

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయంలో మాట్లాడుతూ.. వారం రోజులుగా వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ఉందని, ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. మండలాల్లోని పీహెచ్‌సీల్లో అన్ని సదుపాయాలు కల్పించి, ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మ, గోపాలరావు, పెద్దబోయిన సతీష్, రామ్‌చందర్, చంద్రశేఖర్, రాజశేఖర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నూతన కమిటీ ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎంపిక చేశామని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు తెలిపారు. కోఆర్డినేటర్‌గా జే.రాంబాబు, జనరల్ కెప్టెన్‌గా నాగమోహన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్, నూనె, సబ్బులను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, కౌన్సిలర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కౌన్సిలర్ జమలయ్య, మేనేజర్ ప్రసాద్, డీఈ రవికుమార్, ఆర్‌ఓ రవీందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వండి


చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: రానున్న స్థానిక ఎన్నికల్లో ఎస్సీ కులాలకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంకు హైదరాబాద్ సంక్షేమ భవన్‌లో మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలను ఎస్సీలుగా గుర్తించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ 20 శాతం పెంచాలని, విద్య ఉద్యోగ, ఉపాధి, రాజకీయపరంగా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు నామినేట్ పదవులు కేటాయించాలని విన్నవించారు.

పంటల పరిశీలన


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ నర్మద

సుజాతనగర్: మండలంలో భారీ వర్షాలకు జామ్లా తండా తోగు వాగు పొంగి పొర్లడంతో దెబ్బతిన్న పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించి, పంట వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ నర్మద మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో పత్తి, వరిపొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయని, సుమారు 60 మంది రైతులకు సంబంధించిన 50 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు చెప్పారు. పంట నష్ట వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఏఈఓ నరసింహా, రైతులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్‌కు కొత్త కాంతులు

- జాతీయ రహదారికి అనుసంధానంగా రోడ్డు విస్తరణ
- 1.2 కిలోమీటర్ల డివైడర్, సెంట్రల్ లైటింగ్


సుభాష్‌నగర్ రహదారి

ఇల్లెందురూరల్: మండలంలో అతిపెద్ద గ్రామపంచాయతీకి సుభాష్‌నగర్ కొత్త కాంతులతో పట్టణ శోభను సంతరించుకోనుంది. పూర్తి పల్లె వాతావరణంతో ఉన్న గ్రామం క్రమంగా మేడలు.. మిద్దెలు.. విశాలమైన రహదారులతో సుందరంగా రూపుదిద్దుకుంది. నేడు ప్రధాన రహదారిని మరింత వెడల్పు చేసి మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనికితోడు రహదారి వెడల్పు పనులు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండటం సుభాష్‌నగర్ ప్రజలకు భవిష్యత్‌లో లాభించే పరిణామం. నేడో.. రేపో పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతుండగా ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.10 కోట్ల నిధులతో..

సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు 1.2 కిలోమీటర్ల పొడవున రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చొరవతో ఎస్టీ ఎస్‌డీఎఫ్ పథకంలో భాగంగా రూ.10 కోట్ల నిధులు 2023 జూలైలో మంజూరయ్యాయి. అప్పటి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన కూడా చేశారు. నాటి నుంచి మందకొడిగా సాగిన నిర్మాణ పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో కదలిక వచ్చింది.

జాతీయ రహదారికి అనుసంధానంగా..

హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు ఇల్లెందు మీదుగా జాతీయ రహదారి నిర్మాణం కోసం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో పనులు సాగుతుండగా తదుపరి పనుల కోసం నేషనల్ హైవే అథారిటీ అధికారులు సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. దీనిప్రకారం జాతీయ రహదారి మండలంలోని నెహ్రూనగర్, చల్లసముద్రం, కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి, ఇల్లెందు మండలం లలితాపురం, మొట్లగూడెం గ్రామాల మీదుగా మోదుగులగూడెం గ్రామం వద్ద ఇల్లెందు నుంచి కొత్తగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి అనుసంధానం చేశారు. అయితే సుభాష్‌నగర్ నుంచి లలితాపురం వరకు రహదారి వెడల్పు పనులు సరిగ్గా జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా ఉన్నాయి. లలితాపురం నుంచి సుభాష్‌నగర్ మీదుగా జాతీయ రహదారి స్థాయి వెడల్పుతో సుందరీకరించబడుతున్న ఆర్‌అండ్‌బీ రహదారిపై ప్రయాణించేందుకే వాహనచోదకులు ప్రాధాన్యమిస్తారని, ఇది సుభాష్‌నగర్ భవిష్యత్‌కు, వ్యాపార వృద్ధికి ఉపయోగపడే అవకాశం ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి వెడల్పుపై వీడని సందిగ్ధం...

సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు 1.2 కిలోమీటర్ల పొడవున రహదారి వెడల్పు పనులపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రజల నుంచి వస్తున్న భిన్నాభిప్రాయాలు, రాజకీయ ఒత్తిడుల నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవంగా రోడ్డుకు రెండు వైపులా 50 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణకు అనుమతులు మంజూరయ్యాయి. కానీ, ఇదే జరిగితే ఇళ్లకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇంతేకాకుండా మిషన్ భగీరథ పైపులు 40 మీటర్ల పరిధిలో ఉండటంతో 45 మీటర్లకు కుదించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంలో అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ప్రజలకు అనుకూలంగా ఉండాలి..


రహదారి విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులను స్వాగతిస్తున్నాం. కానీ రోడ్డు వెడల్పు విషయంలో జరుగుతున్న హడావుడి అభ్యంతరకరంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా 45 మీటర్లకు కుదిస్తే అందరికీ ఆమోదయోగ్యమే.

– బియ్యని రాములు, సుభాష్‌నగర్

ప్రజాప్రతినిధులు స్పందించాలి..


సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం వరకు రోడ్డు వెడల్పు అవసరమే. డివైడర్, సెంట్రల్ లైటింగ్ అభివృద్ధికి బాటలు వేస్తాయి. అందరికీ ఆమోదయోగ్యంగా రహదారి విస్తరణ ఉండేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– కుందూరు దేవేందర్‌రెడ్డి, సుభాష్‌నగర్

నిబంధనల ప్రకారమే పనులు..

సుభాష్‌నగర్ నుంచి లలితాపురం గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రాథమికంగా ప్రారంభించాం. ఎవరికీ ఎటువంటి నష్టం జరగనివ్వం. డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో సుభాష్‌నగర్‌కు కొత్త కళ వస్తుంది. ఆర్‌అండ్‌బీ నిబంధనల మేరకే, స్థానికుల, ఉన్నతాధికారుల సూచనలతో విస్తరణ పనులు చేపడుతాం.

– మోతీలాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇల్లెందు మండలం

కాంగ్రెస్‌లో బయటపడిన వర్గపోరు..

జూలూరుపాడు: పాపకొల్లులో మంగళవారం చాకలి ఐలమ్మ ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం హాజరయ్యారు. ఈ మేరకు ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయితే ముందుగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేయకుండా ఎమ్మెల్యేను కొందరు కాంగ్రెస్ నాయకులు ఓ దాత వితరణ చేసిన ఫ్రీజర్ (శవపేటిక) ఓపెనింగ్‌కు తీసుకెళ్లడాన్ని రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. చాకలి ఐలమ్మ సాక్షిగా కాంగ్రెస్‌లో వర్గపోరు బయటపడింది. అంతకముందు గుండెపుడి మేడికుంట చెరువును ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సందర్శించి, పరిశీలించారు. చెరువు కట్ట బలహీనపడటంతో తూము పక్కన లీకేజ్ కావడంతో సోమవారం అధికారులు మరమ్మతులు చేపట్టడంతో ముంపు తప్పిన విషయం విదితమే. అనంతరం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ (అంచనాల కమిటీ) సభ్యుడిగా వైరా ఎమ్మెల్యే నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మండల పర్యటనలో భాగంగా జూలూరుపాడు వచ్చిన ఎమ్మెల్యేను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, కాళ్లూరి వెంకటేశ్వరరావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఐటీఐ పూర్తి చేసిన కార్మికులు, ఉద్యోగుల పిల్లలు ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువతీ, యువకులకు అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ జాన్‌ఆనంద్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ.. మినిస్టరీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ (ఆర్‌డీఎస్‌డీఈ) ఆదేశాల ప్రకారం ఆసక్తి ఉన్నవారు వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని, ఆ వివరాలను 24వ తేదీలోపు సమీపంలోని ఎంవీటీసీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

జూలూరుపాడు: జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్యహత్యల నివారణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైద్యులు, ఆశా కార్యకర్తలు, స్థానికులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవగాహన లేక సమాజంలో ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. సమస్య వచ్చినప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులతో చెప్పుకుంటే పరిష్కారం దొరకే అవకాశం ఉంటుందన్నారు.

వాహనాలకు వేలంపాట

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీఐ జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 11 గంటల లోపు ఆధార్, పాన్ కార్డుతో రైటర్ బస్తీలోని స్టేషన్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలు అవసరం


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: దేశంలో మహిళల మీద పెరిగిపోతున్న హత్యలు, అత్యాచారాలను నిరోధించేందుకు కొత్త చట్టాలు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి కోరారు. మంగళవారం ఇల్లెందులో ఐద్వా మహాసభలో ఆమె మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి సంఘటలకు పాల్పడుతుండటం హేయం అన్నారు. మహిళలు స్వేచ్ఛగా జీవించేందుకు పోరాడాలని, చైతన్యవంతమై అన్నిరంగాల్లో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదాలపు జ్యోతి, జయబునీన్సా, లక్ష్మీకాంతమ్మ, సత్య, సుల్తానా, మరియా, సోమలక్ష్మి, పి.లక్ష్మి, పద్మ, కాంతమ్మ, సరిత, మాధవి, భాగ్య, యాకమ్మ, సుజాత, కోటమ్మ, నాగమణి, మీనాక్షి, మమత పాల్గొన్నారు.

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా తీసుకుని, జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ... మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాపితంగా కలెక్టర్లకు ఈ మేరకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్రం నరసింహారావు, జున్ను రవి, వేల్పుల ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం: ఏఐటీయూసీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యల విషయంలో ఏఐటీయూసీ పదవులు ఉన్నా.. లేకున్నా ముందే ఉంటుందని ఆ యూనియన్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ చేతుల మీదుగ తమ యూనియన్ నాయకులు గుర్తింపు పత్రం అందజేశారని, ఈ సందర్భంగా మంగళవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో వారు మాట్లాడారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడిచినప్పటికీ ధృవీకరణ పత్రం ఇప్పుడు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జి.వీరస్వామి, ఎస్‌వీ రమణమూర్తి, నితిన్, జక్కుల గట్టయ్య, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వల తొలగింపుతో నష్టపోయాం..


మాట్లాడుతున్న మత్స్య సొసైటీ సభ్యులు

ఇల్లెందురూరల్: చల్లసముద్రం పెద్దచెరువు అలుగు వద్ద చేపల వల తొలగింపు కారణంగా ఆర్థికంగా నష్టపోయామని సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. చెరువు నిండా నీరు రావడంతో సొసైటీ ద్వారా చేప పిల్లలను కొనుగోలు చేశామని చెప్పారు. కానీ వలకు చెత్తాచెదారం అడ్డుగా ఉండటం వల్ల కట్టకు ప్రమాదం పొంచి ఉందని దుష్ప్రచారం చేసి అధికారులకు సమాచారం అందించారని వాపోయారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా, కనీసం తమను సంప్రదించకుండా వల తొలగింపుకు సూచన చేయడం సరికాదన్నారు. మేము చెరువు వద్దకు వెళ్లే లోపే వల తొలగించారని, చెరువులో చేప పిల్లలు బయటకు వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ సభ్యులుగా ఉన్న 124 మంది కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. సొసైటీకి రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

స్థానికంగానే గణేష్ విగ్రహాల నిమజ్జనం


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఇల్లెందురూరల్: గణేష్ నిమజ్జనోత్సవం ఏటా ఇల్లెందులో ఘనంగా నిర్వహిస్తుంటారు. అయితే 2014లో అప్పటి మున్సిపల్ పాలకవర్గం మంచినీటి చెరువులో గణేష్ నిమజ్జనోత్సవంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో అనివార్యంగా మరోమార్గం లేక గణేష్ ఉత్సవ కమిటీలు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనం చేసేవారు. కానీ ప్రస్తుతం భారీగా వర్షాలు కురవడం, గోదావరిలో వరద ఉధృతి కారణంగా స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య గణేష్ నిమజ్జనోత్సవం స్థానికంగా నిర్వహించాలని నిర్ణయించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ వంటి కీలక శాఖల అధికారులను ఒప్పించారు. ఇందులో భాగంగా మంగళవారం ఇల్లెందు–కారేపల్లి సరిహద్దులో ఉన్న ఆట్‌నంబర్ చెరువును నిమజ్జనోత్సవం కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవం ఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొందిస్తామని, ఉత్సవ కమిటీలు, భక్తులు సహకరించాలని కోరారు.

పర్యాటక కేంద్రంగా సింగభూపాలెం ప్రాజెక్టు


మాట్లాడుతున్న సీతారాములు

సుజాతనగర్: మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు అన్నారు. కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహన్మంతరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్‌తో కలిసి మంగళవారం ఆయన సింగభూపాలెం ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పర్యాటకంగా అభివృద్ధి చేసేలా నివేదిక ఇస్తామని తెలిపారు. నాయకులు భద్రం, మడిపల్లి శ్రీనివాస్, పైడా ప్రసాద్, నాగార్జున, లింగం పిచ్చిరెడ్డి, మోహన్‌రావు, బాబు, భాస్కర్, రాములు, సాంబయ్య, జయరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సింగభూపాలెం చెరువు కట్ట కుంగిన నేపథ్యాన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, నాయకులు పరిశీలించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడినందున రైతులు అధైర్యపడొద్దని సూచించారు. చెరువు కట్టకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం, పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. నాయకులు భూక్యా భద్రు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కుమారి హన్మంతతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, భాగం శేషభూషణం, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, పాదిల శ్రీనివాసరావు, వీర్ల మల్లేష్, బొడ్డు కేశరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు మెనిఫెస్టోలో పేర్కొన్న రూ.10వేల గౌరవ వేతనం అమలు చేయడం లేదని విమర్శించారు. పాఠశాలల్లో వంట వార్పు పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి కార్మికులకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. మల్లికార్జున్, సత్తెనపల్లి విజయలక్ష్మి, పుష్ప, మంగ, ప్రభావతి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కార్మికులకు పలు హామీలు ఇచ్చి తమను గెలిపించాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కోరాయని, ఇచ్చిన హామీలను గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నెరవేర్చాలని సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్ 27వ తేదీన ఎన్నికలు జరిగితే, సెంట్రల్ కోడ్ నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాల కాలపరిమితితో మెజారిటీ ఓట్లు సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా యాజమాన్యం ఇవ్వకుండా కాలయాపన చేసిందని విమర్శించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు గుర్తింపు హోదా నాలుగు సంవత్సరాలకు ఇవ్వాలని తిరకాసు పెట్టడంతో.. యాజమాన్యం గుర్తింపు పత్రం ఆలస్యం చేసినట్లు చెప్పారు. ఈ కారణంగా తొమ్మిది నెలలపాటు కార్మిక సమస్యలు స్ట్రక్చర్ సమావేశాలు కమిటీలు లేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా గుర్తింపు హోదా కలిగిన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం హోదా కలిగిన ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. లేదంటే పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

పదోన్నతులు కల్పించండి..


సీఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల్లో ఫోర్‌మెన్ పోస్టులు మంజూరు చేయాలని, ఓఅండ్‌ఎం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్(1535) రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లాడి పుల్లారావు, మాలోతు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం స్థానిక కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 2013లో జాయిన్ అయిన జేపీఎలు పదోన్నతులు లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి ఒకే కేడర్‌లో ఉండటంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డీపీసీ నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. కె.సాంబయ్య, అంబాల శ్రీనివాస్, ఐ.నాగరాజు, సురేష్, సతీశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ


కొత్తగూడెంటౌన్: ఎస్పీ కార్యాలయంలో.. మాట్లాడుతున్న పంకజ్

చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. కులవృత్తే జీవనాధారంగా జీవిస్తున్న ఐలమ్మకు దళారులతో ఎదురైన అవమానాలకు ఎదురొడ్డి పోరాటం చేసిందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం అన్నారు. – సాక్షి నెట్‌వర్క్


జూలూరుపాడు: పాపకొల్లులో నివాళులర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


పాల్వంచ: వెంగళరావుకాలనీలో...


ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న చంద్ర అరుణ, నాయిని రాజు, బిచ్చా తదితరులు


టేకులపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో..


కొత్తగూడెంరూరల్: ఐలమ్మకు నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్